

ప్రభుత్వ భూముల పరిశీలన

పరిగి, ఫిబ్రవరి 22: పరిగి శివారులోని తుంకులగడ్డలోని ప్రభుత్వ భూములను తహసీల్దార్ ఆనందరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 530 సర్వేనంబరులో 370 ఎకరాల భూమి ఉందని, అయితే ఇందులో ప్రభుత్వ సంస్థల ఏర్పాటు కోసం ఎంత భూమి ఉందో క్షేత్ర స్థాయిలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వగా, మిగిలిన భూమిని పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కీసర ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి

వీగిన అవిశ్వాసాలు

తూంకుంట, నాగారం మున్సిపాలిటీల చైర్మన్, వైస్ చైర్‌పర్సన్లదే పైచేయి

కీసర రూరల్/శామీర్‌పేట, ఫిబ్రవరి 22:నాగారం మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌పై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ బండారు మల్లేష్‌యాదవ్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ ఈనెల 5న మున్సిపాలిటీకి చెందిన 14మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు తీర్మాన పత్రం అందజేశారు. ఈక్రమంలో అవిశ్వాస సమావేశం నిర్వహించాల్సిందిగా కీసర ఆర్డీవోకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో గురువారం నాగారం మున్సిపల్ కార్యాలయంలో కీసర ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. అవిశ్వాసతీర్మానం ప్రవేశపెట్టిన కౌన్సిలర్లు ఎవరూ హాజరు కాకపోవటంతో అవిశ్వాసం వీగిపోయినట్లుగా ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్, మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. కాగా సమన్వయ లోపంతోనే కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం ప్రకటించినట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నిధుల కేటాయింపులపై గిట్టని వారు తనపై చేసిన ప్రచారంతో ప్రేరేపితమైన కౌన్సిలర్లు క్షణికావేశంలో అవిశ్వాసం ప్రకటించినట్లు తెలిపారు. అలాగే తూంకుంట మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వర్‌రావు, వైస్‌చైర్‌పర్సన్ పన్నాల వాణీవీరారెడ్డిలపై మొత్తం 16మంది కౌన్సిలర్లకు గాను 11మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి చైర్మన్, వైస్‌చైర్‌పర్సన్‌లపై అవిశ్వాసానికి దరఖాస్తులను సమర్పించారు. ఈమేరకు మల్కాజ్‌గిరి ఆర్డీవో శ్యామ్‌ప్రకాశ్ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరిస్తూ అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 11మంది మెజార్టీ కౌన్సిలర్లలో ఏ ఒక్కరూ సమావేశానికి హాజరుకాలేదు. దీంతో ప్రిసైడింగ్ అధికారి అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని అధికారికంగా ప్రకటించారు.



కౌన్సిలర్ పూజభరత్ మోసం చేశాడని నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు మధుసూదన్‌రెడ్డి, రజని తదితరులు

రూ.10లక్షలు తీసుకుని నట్టేట ముంచారు

అవిశ్వాస తీర్మానంలో తమకు పూర్తి మద్దతునిస్తానని తమ వద్ద కౌన్సిలర్ పూజభరత్ రూ.10లక్షలను తీసుకుని గైర్హాజరై మోసానికి పాల్పడినట్లు 4వ వార్డుకు చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సింగిరెడ్డి రజనీ, ఇతర కౌన్సిలర్లు ఆరోపించారు. మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తూంకుంటలో పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. కౌన్సిలర్ పూజభరత్‌లు దొంగలు, దొంగలు, మోసగాళ్ళు అంటూ వారు పోస్టర్లను, ప్లకార్డులు పట్టుకుని డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. కౌన్సిలర్ పూజభరత్ ఇంటి ముందు నిరసన తెలిపారు.

కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్ పూజభరత్ సస్పెన్షన్

1వ వార్డు కౌన్సిలర్ పూజతో పాటు ఆ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆమె భర్త భరత్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు(డీసీసీ) హరివర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ప్రకటించారు. తూంకుంట మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్‌పర్సన్‌లపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో మద్దతు ఇవ్వకుండా గైర్హాజరైనందుకు పార్టీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు.



ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్!

మారనున్న నియోజకవర్గ రూపురేఖలు

సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం దశ మార్చే విధంగా మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతోంది. సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌ను ఐదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుంచే విధంగా కార్యాచరణ సిద్ధం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్య, వైద్య, సాంకేతిక, పారిశ్రామిక, ఉపాధి రంగాల్లో ప్రగతి సాధించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. కొడంగల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు మొదటి విడతలోనే నిధులు కేటాయించారు.

- ఉపాధి కల్పనకు, పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు
- మౌలిక సదుపాయాలకు భారీగా నిధులు
- తొలి విడతలో రూ.4,369.143 కోట్లు మంజూరు
- వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం
- లోక్‌సభ ఎన్నికల తరువాత మరిన్ని నిధులు

కొడంగల్, ఫిబ్రవరి 22 : కొడంగల్ నియోజకవర్గం దశ మార్చే విధంగా మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతోంది. సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌ను ఐదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుంచే విధంగా కార్యాచరణ సిద్ధం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్య, వైద్య, సాంకేతిక, పారిశ్రామిక, ఉపాధి రంగాల్లో ప్రగతి సాధించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. వికారాబాద్, నారాయణపేట జిల్లాల పరిధి లోకి వచ్చే కొడంగల్ నియోజకవర్గం గత ప్రభుత్వాల హయాంలో వివక్షకు గురైన విషయం తెలిసిందే. ఇంత కాలం అభివృద్ధికి దూరంగా ఉన్న కొడంగల్ నియోజకవర్గం దశ మారేలా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. నియోజకవర్గం సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యేకంగా కొడంగల్ ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (కడా)ను ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, ప్రత్యేకాధికారిగా వెంకట్‌రెడ్డిలను నియమించిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన రెండున్నర నెలల్లోనే రూ.4,369.143 కోట్లతో మొదటి దశ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రి వర్గ సహచరులతో కలిసి బుధవారం శంకుస్థాపనలు చేయడం ప్రాంత ప్రజల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసం పెరిగేలా చేసింది. త్వరలో నియోజకవర్గ రూపు రేఖలు మారే విధంగా టెండరు ప్రక్రియ పూర్తి చేసుకుని పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం తీసుకుంటోంది. కొడంగల్ నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపైన సీఎస్ ప్రత్యేకంగా దృష్టి సారించారు.


మహిళా సంఘాలకు చెక్ అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

తొలి విడతలో...

తొలి విడతలో రూ.4,369.143 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల తరువాత మరో రూ.5వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు మొదటి విడతలోనే నిధులు కేటాయించారు. కొడంగల్‌లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు వీలుగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. వైద్య విద్యతో పాటు అనుబంధ కోర్సులు చదివేందుకు వీలుగా కళాశాలలు నిర్మించనున్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా కొడంగల్‌లోని సీహెచ్‌సీని బోధనాసుపత్రికి అప్‌గ్రేడ్ చేయడం వల్ల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. ఇప్పటి వరకు అత్యవసర వైద్య సేవలకు మహబూబ్‌నగర్‌కు, లేదా హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేది. బోధనాసుపత్రి అందుబాటులోకి వస్తే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఇక్కడే లభించనున్నాయి. లోక్‌సభ ఎన్నికల తరువాత నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచే విధంగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిసింది. వికారాబాద్, నారాయణపేట జిల్లాల పరిధి లోకి వచ్చే కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధి విషయంలో అన్ని మండలాలకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా చర్యలు చేపడుతున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నియోజకవర్గం అభివృద్ధికి తొలి విడత కింద రూ.4,369.143 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రాంత ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి ఎట్టకేలకు శంకుస్థాపన జరిగింది. రూ.2,945 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నారు. రూ.224.50 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలలు, సీహెచ్‌సీని 220 పడకల బోధనాసుపత్రిగా అప్ గ్రేడ్ చేయనున్నారు. రూ.213.2070 కోట్లతో కొడంగల్ నియోజకవర్గంలో హెల్‌ఎల్పీఎస్, అప్రోచ్ రోడ్డు పనులు, రూ.344.5 కోట్లతో సింగిల్ లైన్ రోడ్లను డబుల్ లైన్ రోడ్లుగా తీర్చిదిద్దేలా విస్తరణ పనులు, బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టనున్నారు. రూ.6.8 కోట్ల వ్యయంతో కొడంగల్‌లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహనిర్మాణం, రూ.27.886 కోట్లతో బీటీ రోడ్డు సదుపాయం లేని మారుమూల గిరిజన ప్రాంతాలకు బీటీ రోడ్డు సౌకర్యం, రూ.5 కోట్లతో గిరిజన సంక్షేమ హాస్టల్ భవనం, రూ.25 కోట్లతో మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ శాశ్వత భవన నిర్మాణం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.40 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, రూ.7.13 కోట్లతో దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, రూ.7.13 కోట్లతో బొంరాస్‌పేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు స్వంత భవనాలు, రూ.25 కోట్లతో దౌల్తాబాద్ మండలం, నీటూర్ గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల నిర్మాణం, రూ.360 కోట్లతో దౌల్తాబాద్ మండలం, చంద్రకల్ గ్రామంలో నూతన వెటర్నరీ కళాశాల నిర్మాణం, రూ.30 కోట్లతో కోస్గి మండల కేంద్రంలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల, రూ.11 కోట్లతో కోస్గి మండల కేంద్రంలో మహిళా డిగ్రీ కళాశాల, రూ.20 కోట్లతో మద్దూర్ మండల కేంద్రంలో సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాల, రూ.25 కోట్లతో కొడంగల్ మండల కేంద్రంలో బాలుర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాల, రూ.3.99 కోట్లతో దుద్యాల మండలం, హస్నాబాద్ గ్రామంలో నూతన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ పనులు వేగంగా ముందుకు సాగే విధంగా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి.

రెండో విడతలో రూ.5 వేల కోట్లతో అభివృద్ధి



ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వెళుతున్న ప్రాంత ప్రజలకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు మెరుగయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అధిక సంఖ్యలో పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మూడు వేల నుంచి ఐదు వేల ఎకరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. పారిశ్రామికవాడలుగా అభివృద్ధి పరచాల్సిన ప్రాంతాలను అధికారులు గుర్తించారు. ముఖ్యమంత్రి నిర్ణయించిన ప్రాంతాలను పారిశ్రామికవాడలుగా అభివృద్ధి పరచనున్నారు.

ప్రణాళికాబద్ధంగా...

కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధిపై ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్న సీఎం ఏయే ప్రాంతంలో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే విషయమై ఆయన ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. మహబూబ్‌నగర్ - చించోలి జాతీయ రహదారి మీదుగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. సీఎం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తరువాతనే పరిశ్రమలు ఎక్కడ ఏర్పాటు కానున్నాయనేది స్పష్టత రానుంది. కొడంగల్ ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని సీఎం తనను కలిసిన పారిశ్రామిక వేత్తలను కోరినట్లు తెలిసింది. సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటైతే స్థానికంగా ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగు పడనున్నాయి. సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాంతం అనువైనదనే విషయం తెలిసిందే.



లోక్‌సభ ఎన్నికలకు కసరత్తు!

- ఉద్యోగుల సమాచార సేకరణ వేగవంతం
- డీఈవో ఆధ్వర్యంలో ఇప్పటికే సగం పూర్తి



మేడ్చల్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి), ఫిబ్రవరి 22 : పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వచ్చేనెల మార్చిలో వెలువడుతుందనే ప్రచార నేపథ్యంలో అధికార యంత్రాంగంలో హడావుడి మొదలైంది. ఎన్నికల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించే సిబ్బంది సమాచార సేకరణ, కంప్యూటర్‌లో వారి వివరాలు పొందుపరిచే ప్రక్రియను వేగవంతం చేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్ వేదికగా 55 శాఖల నుంచి ఉద్యోగుల సమాచారం తెప్పించి కంప్యూటర్‌లో క్రోడీకరిస్తున్నారు. షెడ్యూల్ ఎప్పుడు విడుదలైనా అంతాసిద్ధం చేసి పెట్టుకుంటున్నారు. మేడ్చల్‌లో జిల్లాలో ఒక మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానం ఉంది. దీని పరిధిలో మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కంటోన్మెంట్, ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి నియోజకవర్గాలున్నాయి. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో ఇప్పటికే కౌంటింగ్, రిసెప్షన్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. ఇప్పటికే సగానికి పైగా ఉద్యోగుల సమాచారాన్ని సేకరించారు. ఇందుకోసం డీఈవోకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు.

పూర్తి వివరాలతో ..

ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 45 రకాల వివరాలను సేకరిస్తున్నారు. పుట్టిన తేదీ మొదలుకుని, తీసుకునే మూలవేతనం, సొంత నియోజకవర్గం, పనిచేస్తున్న జిల్లా, ఎపిక్ నంబరు, పోలింగ్ కేంద్రం, ఫోన్ నంబరు వంటి వ్యక్తిగత సమాచారం క్రోడీకరిస్తూ ప్రతి ఒక్కరికి ఫోన్లు చేస్తూ సమాచారాన్ని ధ్రువీకరించుకుంటున్నారు. అంతా పూర్తయ్యాక కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో 2397 పోలింగ్ కేంద్రాలుండగా అందు కోసం దాదాపు 11వేలకు పైగా సిబ్బంది అవసరముంటుంది. ఇంకా పోలింగ్ కేంద్రాలు పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఐదుగురు చొప్పున సిబ్బందిని నియమిస్తూ అదనంగా మరో 20 శాతం మంది ఉద్యోగులను రిజర్వులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

55 శాఖలు... 45 రకాల సమాచారం

దేశ ఎన్నికలు కావడంతో అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. జిల్లా వ్యాప్తంగా అత్యవసర విభాగాలైన వైద్యం, ఎక్సైజ్, రవాణా, అగ్నిమాపక, పోలీసు విభాగాలు మినహా ఎన్నికల నిర్వహణకు 55 శాఖల సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు. పీవో, ఏపీవో, ఓపీవోల కోసం ఆయా శాఖల్లో పనిచేస్తున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. బేసిక్ పేను బట్టి ఎవరిని పీవోగా, ఏపీవోగా, ఓపీవోగా నియమించాలో నిర్ధారిస్తున్నారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు, గతంలో శాఖాపరంగా కేసులు, విచారణ వంటివి ఉన్నాయా..? అని ఆరా తీస్తున్నారు. బ్యాంకు ఖాతా వివరాలను సైతం తీసుకుంటున్నారు. శాఖల వారీగా వచ్చిన సమాచారం సరైందా? కాదా? అని కూడా వ్యక్తిగతంగా ఫోన్లు చేసి తెలుసుకుంటున్నారు. ఫిబ్రవరి 8న విడుదలైన ఓటరు జాబితా ప్రకారం ఉద్యోగుల ఎపిక్ నంబరు సహాయంతో పార్ట్ నంబరు, సీరియల్ నంబరు పోల్చి చూస్తున్నారు. ఇచ్చిన సమాచారంలో ఏ చిన్న పొరపాటు దొర్లినా శాఖ అధిపతులనే బాధ్యులుగా చేస్తూ వారి నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారు.

క్షుణ్ణంగా పరిశీలన..

మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టరేట్ వేదికగా మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం సమాచారం సేకరిస్తున్నారు. అన్ని వివరాలను క్షుణ్ణంగా... సూక్ష్మంగా పరిశీలిస్తున్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి సమాచారం ఇచ్చినట్లుగా శాఖాధిపతుల నుంచి ధ్రువీకరణ పత్రం కూడా రాయిస్తున్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 22: పదోతరగతి, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షలను ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించాలని ఆయన సూచించారు. పది పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 310 పరీక్షా కేంద్రాల్లో 13,412 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. గతంలో పదోతరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని 2300 మంది విద్యార్థులు 10కేంద్రాల్లో పరీక్షలకు హాజరుకానున్నట్లు కలెక్టర్ తెలిపారు.

28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలు

ఈనెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జిల్లాలో 29 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇంటర్ పరీక్షలో 16,823 మంది పరీక్షలకు హాజరు హాజరు కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 7,799 విద్యార్థులు ఉండగా ఇందులో జనరల్ 6,447 వృత్తి విద్యలో 1,352 మంది పరీక్షలు రాయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇంటర్ సెకండియర్‌లో 9,024 మంది విద్యార్థులుండగా, 7,689 మంది జనరల్ , 1,335 మంది వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన వివరించారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు 10పోలీస్‌స్టేషన్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. పరీక్షలను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాస్‌కాపీయింగ్ జరిగినట్లు సమాచారం అందితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి, ఆర్డీవో విజయకుమారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.శంకర్ నాయక్, డీఈవో రేణుకాదేవి, డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ జయరాజు, మనోహర్‌దాస్, డీటీవో జస్వంత్‌కుమార్, పోస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృక్ష, జంతు సంపదను పరిరక్షించుకుందాం

- జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్



వికారాబాద్, ఫిబ్రవరి 22 :మన అడవులను, జంతుజాలాన్ని రక్షించుకుందాం..భవిష్యత్‌తరాలకు వృక్ష, జంతు సంపదను పరిరక్షించుకుందాం అని జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. ప్రస్తుతం ఎండాకాలం ఎండలు తీవ్రమవుతున్న వేళ అడవుల్లో అగ్గి రాజుకోవడం సాధారణంగా జరుగుతుందని దాని నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా వికారాబాద్ అడవులలో గడ్డి భూములు ఇలాంటి ఫారెస్ట్ ఫైర్‌కి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. తొందరగా తగలబడే అవకాశం ఉన్న గడ్డి అనంతగిరి, దామగుండం, తిప్పాపూర్, మోత్కుపల్లి అడవులలో కనిపిస్తాయన్నారు. 95 శాతం వరకు మానవ తప్పిదాల వల్లనే అడవులలో అగ్గి రాజుకుంటోందన్నారు. మిగిలిన 5 శాతం మాత్రమే సహజ కారణాల వల్ల అడవులు తగలబడుతున్నాయి. ఆధునిక పద్ధతుల ద్వారా ఫైర్ అలర్ట్స్ ఫారెస్ట్ సిబ్బంది టీవీ, మొబైల్‌ఫోన్లలకు వెంటనే సమాచారం చేరుతుందన్నారు. తద్వారా ఎక్కడ అగ్గి రాజుకుంటుందో అక్కడికి వెంటనే సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పడం జరుగుతుందని తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

- కాంగ్రెస్ మోసపూరిత గ్యారంటీలతో మభ్యపెట్టింది
- బీజేపీ జాతీయ నాయకులు డీకే.అరుణ, జితేందర్‌రెడ్డి


కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో విజయసంకల్ప యాత్రలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కొడంగల్, ఫిబ్రవరి 22: దేశం కోసం ఆహర్నిషలు శ్రమిస్తున్న ప్రధాని మోదీకి మద్దతుగా మనందరం కలిసికట్టుగా పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ జాతీయ నాయకులు డీకే.అరుణ, జితేందర్‌రెడ్డి, శాంతికుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీజేపీ చేపట్టిన విజయసంకల్ప యాత్ర గురువారం కొడంగల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం బీజేపీ గెలిస్తే వికారాబాద్-కృష్ణ రైల్వేలైన్, పాలమూర్-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి మార్గం సుగమం అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం సహకారం లేనిది తెలంగాణలో అభివృద్ధి జరిగే అవకాశం లేదన్నారు. అన్నీ రంగాల్లో వెనకబడిన కొడంగల్ ప్రాంతం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి అధిక నిధుల మంజూరుతో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మూడో సారి కేంద్రంలో బీజేపీ గెలుపుతో నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి విజయ సంకల్ప యాత్రకు మద్దతు తెలపడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పూనంచంద్‌లాహోటి, బస్వరాజ్, హర్షవర్ధన్‌రెడ్డి, కుంద్రు నర్సిములు, బాబాయ్యనాయుడు, బంటు రమేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

కట్ట మైసమ్మ ఆలయ చైర్మన్‌గా అశోక్

శామీర్‌పేట, ఫిబ్రవరి 22: శామీర్‌పేట పెద్ద చెరువు కట్ట మైసమ్మ ఆలయ నూతన చైర్మన్‌గా విలాసాగరం అశోక్‌ను గ్రామ ప్రజలు, భక్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శామీర్‌పేట గ్రామంలో వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు గురువారం పెద్ద ఎత్తున సమావేశాన్ని నిర్వహించి కట్ట మైసమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికలో వారు అశోక్‌ను కట్ట మైసమ్మ అమ్మవారు ఆలయ కమిటీ నూతన చైర్మన్‌గా, కోశాధికారిగా దూడల వెంకటేశ్‌గౌడ్, సలహాదారుగా గుర్రం సునీల్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


అశోక్



జన సంద్రమైన జంపన్నవాగు పరిసర ప్రాంతాలు

శిగాలూగుతున్న వనం



చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు



సమ్మక్కకు మొక్కుగా గొర్రెపిల్లను ఎదుర్కోలు ఇస్తున్న భక్తుడు





క్యూలైన్లలో భక్తుల రద్దీ









సమ్మక్క గద్దె

- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి 'వన' సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు

మేడారం బృందం, ఫిబ్రవరి 22: సమ్మక్క - సారలమ్మ జాతరతో వనం శిగాలూగుతోంది. మేడారం భక్తిపారవశ్యంతో మురిసిపోతోంది. మహాజాతరలో తొలిరోజైన బుధవారం అర్ధరాత్రి సారలమ్మ గద్దెపై కొలువు దీరగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజైన గురువారం ఉదయం నుంచి జరిగిన ప్రత్యేకపూజల అనంతరం మాఘశుద్ధ పౌర్ణమి వెలుగుల్లో చిలుకలగుట్ట నుంచి జనంలోకి వచ్చిన సమ్మక్క.. గద్దెపై కొలువుదీరారు. ఆ అమ్మ ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు ఎదురుచూసిన లక్షలాది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రస్తుతం మేడారం పరిసరాల్లో కోటి మందికిపైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. శుక్రవారం భక్తుల రాక రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో మేడారం.. పుణ్యస్నానాలు చేసే వచ్చే భక్తులతో జంపన్నవాగు తీరం.. తల్లులను దర్శించుకుంటున్న భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.

గద్దెపైకి సమ్మక్క

గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయమే పూజారులు మేడారంలోని సమ్మక్క గుడిలో సమ్మక్కను తరలించే ప్రక్రియను ప్రారంభించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పూజారుల బృందం అడవికి వెళ్లి కంకవనాన్ని తీసుకురాగా.. ఈ తంతులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకల గుట్టకు బయలు దేరింది. మధ్యలో క్రిష్ణయ్య ఒక్కరే సమ్మక్క స్థావరం వద్దకు వెళ్లి పూజలు చేశారు. తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఈ క్రమంలో ములుగు ఎస్పీ శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రోప్ పార్టీ బలగాల సాయంతో పూజారులు సమ్మక్కను మేడారం గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో భక్తులు పలు చోట్ల కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. గద్దెల వద్ద సమ్మక్కను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. అయితే బుధవారమే సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకోగా.. సమ్మక్క రాకతో జాతరకు పరిపూర్ణత వచ్చింది. సమ్మక్క వన ప్రవేశం జరిగే శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.

ప్రముఖుల రాక

గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు.

కమనీయంగా లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి



భక్తులకు తాళి చూపిస్తున్న అర్చకులు

కడ్తాల్, ఫిబ్రవరి 22 : కడ్తాల్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచే కాకుండా నగరం నుంచి సైతం భారీగా భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించి తన్మయులయ్యారు. ఈ ఉత్సవాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అర్చకుడు మెశ్లూరి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఉత్సవ, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్లు టి.వేణుగోపాల్, పాలాది ఆంజనేయులు, ఈవో మోహన్‌రావు ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేశారు. అర్చకులు శ్రీధర్, నర్సింహమూర్తి, శ్రీమన్నారాయణ, వేణుగోపాల్ పూజాకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జి.శ్రీనివాస్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ గంప వెంకటేశ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, యాట నర్సింహ, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్, యాదగిరిరెడ్డి, నరేందర్‌రెడ్డి, హన్మనాయక్, శ్రీకాంత్‌రెడ్డి, ఎం.కృష్ణ, జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, మల్లప్ప, కేశవరెడ్డి, బుచ్చయ్య, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం

ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం చేస్తాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో గడిపేవారు ఆనందమయ జీవితాన్ని ఆస్వాదిస్తారన్నారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి పూజల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పురాతన ఆలయాల పునరుద్ధరణకు కృషి చేస్తానన్నారు.

అర్చకులకు చేయూత

లక్ష్మీచెన్నకేశస్వామి ఆలయంలో నిత్య పూజలు నిర్వహిస్తున్న అర్చకులకు డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి చేయూతనిచ్చారు. అర్చకుల గౌరవవేతనాల కోసం ఆయన ఏటా రూ.60వేలు ఇస్తున్నారు. గురువారం ఈ మొత్తాన్ని అర్చకులకు అందజేశారు. అర్చకులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించారు.



స్వామి వారి విగ్రహాలకు హారతి ఇస్తున్న భక్తులు

'పట్నం' బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 22 : 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.13.10 కోట్లతో అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. గురువారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సమావేశానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. కమిషనర్ రవీందర్‌సాగర్ బడ్జెట్‌ను కౌన్సిల్ ముందుంచారు. పన్నుల ద్వారా రూ.5.15 కోట్లు, నాన్‌టాక్సుల ద్వారా రూ.2.28 కోట్ల ఆదాయం సమకూరనున్నట్లు చెప్పారు. మిగతా మొత్తాన్ని ఇతర గ్రాంట్ల ద్వారా రాబట్టనున్నట్లు తెలిపారు. రూ.5.23 కోట్లు చార్జ్‌డ్ ఖర్చులను చూపగా, శానిటేషన్ సిబ్బంది జీతభత్యాలు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ చార్జీలు చూపారు. బడ్జెట్‌లో 10 శాతం గ్రీన్ బడ్జెట్ కింద చూపారు. గతేడాది మార్చిలో బడ్జెట్ రూ.18.48 కోట్ల అంచనాతో కౌన్సిల్ ఆమోదం పొందినా డిసెంబరు 31 వరకు రూ.4.81 కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు చూపారు. పట్టణ ప్రగతి నిధులు ఆరు నెలలుగా రాలేదని చెప్పారు. సవరణ బడ్జెట్ అంచనాను రూ.10.10 కోట్లుగా చూపారు. టాక్సుల రూపేణా రూ.5.43 కోట్లు అంచనా ఉండగా డిసెంబరు 31 వరకు రూ. 2.58 కోట్లు మాత్రమే రాబట్టామని మిగతా మొత్తాన్ని మార్చి నెలాఖరుకల్లా రాబట్టనున్నట్లు తెలిపారు. వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

ఈ నెలాఖరు వరకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలో రోజుకు 40 లక్షల లీటర్ల తాగు నీరు సరఫరా చేస్తున్నామని, వేసవిని దృష్టిలో ఉంచుకుని అదనంగా పది లక్షల లీటర్ల నీటిని ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు తాగునీటి కోసం నల్లా కనెక్షన్ ఇవ్వాలని సూచించారు.

లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందడానికే సీఎం సభ

- వికారాబాద్‌కు ఏమిస్తారో సీఎం చెప్పలేదు
- నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతలను వికారాబాద్ వరకు పొడిగించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొకట్ మాధవరెడ్డి



మాధవరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందడానికే కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి సభ నిర్వహించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొకట్ మాధవరెడ్డి గురువారం ఓ ప్రకటనలో చెప్పారు. ప్రజలకు అబద్ధాలు చెప్పి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్‌కు ఆరు గ్యారెంటీలు అమలు చేసే సత్తా లేదన్నారు. విభజన చట్టంలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును కాంగ్రెస్ ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. గోదావరి, కృష్ణా నీళ్లు రాకపోవడంతో జిల్లాలోని సాగుభూములు బీడుభూములుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ తన జిల్లా అంటూ పదే పదే చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ నియోజకవర్గానికి ఏమిస్తారనేది ఎందుకు చెప్పడంలేదని ప్రశ్నించారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని వికారాబాద్ వరకు పొడిగించి ఈ ప్రాంత రైతులకు నీళ్లు అందించాలని కోరారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు సోయి తెచ్చుకుని నీళ్లు ఇవ్వాలని సీఎంను కోరాలని సూచించారు. ఆ పార్టీ నేతలు బీఆర్ఎస్ లాగే అహంకార పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ విజయసంకల్ప యాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారని చెప్పారు. పదేళ్ల పాలనలో మోదీ చేసిన అభివృద్ధిని వివరిస్తూ యాత్ర చేస్తున్నామని, అందుకే బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందం ఉందంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కేంద్రప్రభుత్వం సహకారం లేకుండా రాష్ట్రప్రభుత్వం ఒక్క పని కూడా చేయలేదని ఆయన చెప్పారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

- మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సుధారాణి



సుధారాణి

వికారాబాద్, ఫిబ్రవరి 22 : విదేశ యూనివర్సిటీలలో చదవడానికి ఆగస్టు 1 నుంచి 31 డిసెంబర్ 2023 మధ్య అడ్మిషన్ తీసుకున్న మైనారిటీ విద్యార్థులు ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకం ద్వారా స్కాలర్‌షిప్, ఆర్థికసహాయం కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డి సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం దరఖాస్తుదారుని కుటుంబ సంవత్సర ఆదాయం రూ.5 లక్షల లోపు ఉండాలన్నారు. ఇంజనీరింగ్‌లో పీజీ చేయడానికి 60 శాతం, డాక్టరేట్ చదవడానికి పీజీలో 60 శాతం మార్కులు ఉండాలని చెప్పారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, దక్షిణకొరియాల్లోని యూనివర్సిటీలలో అడ్మిషన్ పొంది ఉండాలని, మిగతా వివరాల కోసం మైనారిటీ సంక్షేమ శాఖ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. అర్హత కలిగిన వారు మార్చి 23 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్, దరఖాస్తు కాపీ, 3 జతల జిరాక్స్ కాపీలను మార్చి 30న సాయంత్రం 5 గంటల్లోపు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని చెప్పారు. ఎంపికయిన విద్యార్థులకు రూ.20 లక్షల ఉపకారవేతనం, రూ.60వేలు విమానచార్జీలు చెల్లిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. వివరాలకు 9440685713 సంప్రదించాలన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారి భానుప్రకాష్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న భాను ప్రకాష్

కొందుర్గు, ఫిబ్రవరి, 22 : బాల్య వివాహాలను అరికట్టాలని బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారి భానుప్రకాష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పులుసుమామిడి శివారులో ఉన్న కేజీబీవిలో బాలల హక్కులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు, అక్రమ దత్తత, అక్రమ రవాణా, బాలకార్మికులు, చైల్డ్ హెల్ప్ లైన్ 1908, భిక్షాటన, లింగ వివక్షత, సేఫ్ టచ్, అన్‌సేఫ్‌టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. షాద్‌నగర్ సీడీపీవో నాగమణి మాట్లాడుతూ విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని, కష్టపడి కాకుండా, ఇష్టపడి చదవాలని, సూచించారు. కేజీబీవి ప్రిన్సిపాల్ శకీనానిస్సా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేవతి, అంగన్‌వాడీ టీచర్లు సంగీత, రాజమణి, ప్రేమలత, పాఠశాల ఉపాధ్యాయులు అనురాధ, ఉమాదేవి, సునిత, పల్లవి, కల్పన, మల్లీశ్వరి పాల్గొన్నారు.

సొంత గూటికి రావడం సంతోషకరం

- మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 22 : గతంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్, బీజేపీలో చేరిన నాయకులు తిరిగి సొంత గూటికి రావడం సంతోషకరమని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని బాచుపల్లి, జైత్వారం గ్రామాల నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం తుక్కుగూడలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ రోజు గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని, ఇక్కడికి వచ్చే వారిలో ఎక్కువ మంది ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అనుచరుల బాధితులే ఉన్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు చిక్కుముడులు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని మండిపడ్డారు. బాచుపల్లి, జైత్వారానికి చెందిన వెంకటేష్, మహేందర్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. కృష్ణానాయక్, జంగారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆపద సమయాల్లో ఆపన్నహస్తం

కొడంగల్, ఫిబ్రవరి 22: ఆపద, అత్యవసర సమయాల్లో వైద్య సేవల నిమిత్తం శ్రీరాంరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యం లో అంబులెన్స్ అందించడం అభినందనీయమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొడంగల్ నియోజకవర్గ పర్యటన లో భాగంగా బుధ వారం రాత్రి సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి సూచన మేరకు శ్రీరాంరెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీరాంరెడ్డి రూ.9ల క్షలతో అంబులెన్స్‌ను కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి అందజే శారు. త్వరలోనే మరో అంబులెన్స్‌ను దౌల్తాబాద్ ప్రభుత్వాసుప త్రికి అందించనున్నట్లు తెలిపారు. కొడంగల్ నియోజకవర్గంలో 2006లో ఏర్పాటు చేసిన శ్రీరాంరెడ్డి చారిటబుల్ ట్రస్టు పేద విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలతో పాటు ఎన్నో సేవా కార్య క్రమాలను చేపడుతున్నారు. ఈ క్రమంలో మరో ముందడు గుతో రోడ్డు ప్రమాదాలు తదితర సంఘటనల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అండగా నిలిచేందుకు తన సొంత నిధు లతో అంబులెన్స్ సౌకర్యం కల్పించేందుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

యువత స్వయం ఉపాధితో ఎదగాలి



నవాబుపేట: పూలపల్లి సమీపంలో నూతన పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



పూడూరు: తిర్మలాపూర్‌లో ఫిట్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట, ఫిబ్రవరి 22: యువత స్వయం ఉపాధితో ఎదగాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. మండలం లోని పూలపల్లి సమీపంలో గురువారం నూతన పెట్రోల్ బంక్‌ను వారు ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్ విఠల్‌రెడ్డి, అక్నాపూర్ మాజీ సర్పంచ్ అజయ్‌కుమార్, నాయకులు చంద్రగౌడ్ పాల్గొన్నారు.

పరిగి: పరిగి పట్టణంలో ఉపాధి పథకం కింద కొత్తగా ఏర్పాటు చేసిన టీస్టాల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిగి మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య, ఎఎంసీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, వైఎస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, మండల అధ్యక్షుడు బి.పరశురాం రెడ్డి, డీసీసీ కార్యదర్శి జింకల యాదయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు తావుర్యానాయక్, ఫ్లోర్ లీడర్ జె.శ్రీనివాస్, బీజేపీ జిల్లా కార్యదర్శులు రాము యాదవ్, జి.బాలకిష్టారెడ్డి, ఎర్రగడ్డపల్లి గోపాల్, నిర్వాహకులు వెంకటేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

పూడూరు: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో రాజేందర్, పాండు బ్రదర్స్ ఏర్పాటు చేసిన ఆర్‌పీ బాస్ ఫిట్‌నెస్ సెంటర్‌ను గురువారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత స్వయం కృషితో ఎదగాలని సూచించారు. సొంత వ్యాపారంతో ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం గ్రామంలో సీసీరోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కార్యదర్శి పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, గోపాల్, మహేందర్, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఔటర్‌పై ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌కు జైలుశిక్ష

మేడ్చల్, ఫిబ్రవరి 22: మేడ్చల్ పరిధిలోని సుతారిగూడ ఔటర్ టోల్‌ప్లాజా వద్ద 2016లో ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్‌కు మేడ్చల్ న్యాయస్థానం జైలుశిక్ష, జరిమానా విధించింది. మేడ్చల్ ఏఎంఎం కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. 2016 ఆగస్టు 31వ తేదీన మేడ్చల్ పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్డుపై లారీ డ్రైవర్ సైలేందర్ పాండే(45) సుతారిగూడ టోల్‌ప్లాజా వద్ద పూర్తిగా లారీని నిర్లక్ష్యంగా నిలిపాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు లారీని ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది తీవ్రగాయాలపాలై మృతిచెందారు. దీంతో మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని, న్యాయస్థానం చార్జీషీట్ దాఖలు చేయగా, మేడ్చల్ ఏఎంఎమ్ కోర్టు న్యాయమూర్తి దిలీప్ నాయక్ వాదోపవాదాలు విని గురువారం తీర్పు వెల్లడించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ సైలేందర్ పాండేకు రెండేళ్ల సాధారణ జైలుశిక్ష, రూ.11వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

● బషీరాబాద్ పీఎస్‌లో కేసు నమోదు



పోలీస్‌స్టేషన్ వద్ద హల్‌చల్ చేస్తున్న యువకుడు

బషీరాబాద్, ఫిబ్రవరి 22: మద్యం మత్తులో ఓ యువకుడు నడి రోడ్డుపై హల్‌చల్ చేస్తున్న ఓ యువకుడిపై బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. సునీల్ చౌహాన్ అనే యువకుడు రోడ్డుపై మద్యం మత్తులో ఇష్టానుసారంగా వ్యవహరించడంతో అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎస్‌ఐ రమేశ్ అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మద్యం మత్తులో ఉన్న అతడు స్టేషన్‌లో పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. ఒకచోట కూర్చోకుండా గంటపాటు పోలీస్‌స్టేషన్ ఆవరణలో హంగామా సృష్టించాడు. దీంతో ఎస్‌ఐ ఆదేశంతో పోలీస్ సిబ్బంది అతన్ని మత్తు దిగే వరకూ పోలీస్‌స్టేషన్‌లోనే కూర్చోబెట్టారు. మద్యం మత్తుతో హంగామా సృష్టించిన యువకుడిపై పబ్లిక్ న్యూసెన్స్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అభివృద్ధికి రూ.85.75లక్షలతో ఏకగ్రీవ తీర్మానం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 22: మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనులతోపాటు శానిటేషన్ సామగ్రి కొనుగోలుకు రూ.85.75లక్షలతో కేటాయించాలని పోచారం మున్సిపాలిటీ పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేసింది. చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మున్సిపాలిటీ అత్యవసర సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్ సర్వేనెంబరు 137, 138లలోని డంపింగ్‌యార్డులో గల చెత్తకు తరుచు మంటలు అంటుకోని పొగలు వ్యాపిస్తుండటంతో స్థానికులు కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపాలిటీకి నోటీసులు జారీ చేసినట్లు చైర్మన్ వివరించారు. ఈసమస్యను అధిగమించడానికి చెత్తను జవహర్ నగర్ డంపింగ్ యార్డులకు తరలించేందుకు రూ.30లక్షలు, డంపింగ్ యార్డు స్థలానికి ఎంఎస్ షీట్లతో కంచె నిర్మాణానికి రూ.50లక్షలు కేటాయించాలని తీర్మానించారు. అదేవిధంగా మున్సిపాలిటీలో శానిటేషన్ పరికరాలు క్యాపులు, సున్నం, బ్లీచింగ్, గంపలు, గ్లౌజులు తదితర వస్తువుల కొనుగోలుకు రూ.5.75లక్షలు కేటాయించారు. మొత్తం పనులకు రూ 85.75లక్షలను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కేటాయించాలని కౌన్సిల్ ఎకగ్రీవ తీర్మానం తెలిపింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, కౌన్సిలర్లు మహేష్, హిమ, బాల్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్, హరిప్రసాదరావు, పోచమ్మ, రవీందర్, సరిత, కోఆప్షన్ సభ్యుడు అక్రంఅలీ, ఏఈ నరేష్ పాల్గొన్నారు.

రైతుసంఘం జిల్లా కార్యదర్శి సురేశ్‌కుమార్‌కు సన్మానం



సురేశ్‌కుమార్‌ను సన్మానిస్తున్న యువకులు

కొడంగల్, ఫిబ్రవరి 22: తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం వికారాబాద్ జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గంటి సురేశ్‌కుమార్‌ను పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కొడంగల్‌లో గురువారం ఎండీ.షాకీర్, మున్నా, చిన్న, చారి, రవినాయక్, రమేశ్‌నాయక్, బాబునాయక్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురేశ్‌కుమార్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పించడం హర్షణీయం అన్నారు.

వైభవంగా వైకుంఠోత్సవం



బ్రహ్మోత్సవాల్లో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 22 : ఘట్‌కేసర్ మండం, ఎదులాబాద్‌లోని రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వైకుంఠోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సేవాకాలము, ప్రాబోధిక ఆరగింపు, తీర్థప్రసాద గోష్టి, మంటప ప్రాకరసేవ, పరమపదోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ఉత్సవాన్ని తిలకించారు. ఈ రోజు ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో రుక్మిణి, సత్యభామ శ్రీ వేణుగోపాల స్వామి తిరుక్కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు అంబారిపేట అప్పాలాచార్యులు, రాంప్రసాద్, వరదరాజులు తెలిపారు.

ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్

యాలాల, ఫిబ్రవరి 22: ఐదు సంవత్సరాలు లోపు ఉన్న చిన్నారులకు తప్పనిసరిగా పోలియోచుక్కలు వేయాలని కమ్యూనిటీ హెల్త్‌సూపర్‌వైజర్ చంద్రశేఖర్ అన్నారు. ఆయన గురువారం ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ, ఆశావర్కర్లతో పోలియో చుక్కలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 4070 మంది చిన్నారులు ఉన్నారని చెప్పారు. వీరందరికీ మార్చి 3వ తేదీన తప్పనిసరి పోలియో చుక్కలను వేయాలన్నారు. ఇందుకోసం మండలంలో 42 మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, సూపర్‌వైజర్ శోభారాణి, బసయ్య తదితరులు పాల్గొన్నారు.

పాంబండ ఆలయ ఆవరణలో

టెంకాయల విక్రయానికి బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న చైర్మన్ నర్సమ్మ రాములు, ఏవో సుధాకర్

కులకచర్ల, ఫిబ్రవరి 22: మండలంలోని బండ వెల్కిచర్ల గ్రామ పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో టెంకాయల విక్రయానికి, తలనీలాలు పోగు చేసుకునేందుకు గురువారం వేలం నిర్వహించారు. చైర్మన్ నర్సమ్మ రాములు, ఏవో సుధాకర్, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ రవిబాబా ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ముందుగా త్వరలో జరిగే బ్రహ్మోత్సవాల్లో టెంకాయలు, ప్రసాదాల విక్రయానికి వేలం నిర్వహించగా వాయిదా పడింది. అనంతరం చిన్న, పెద్ద జాతర మినహా సంవత్సరం పాటు టెంకాయలు, ప్రసాదాలు విక్రయించేందుకు నిర్వహించిన వేలంలో బండవెల్కిచర్లకు చెందిన బి.శివప్రసాద్ టెంకాయలు రెండు జాతరలు మినహాయించి ఒక సంవత్సరం పాటు ఏప్రిల్ 1 నుంచి మార్చి 2025 వరకు విక్రయించుకునేందుకు రూ.5,51,00కు దక్కించుకున్నారు. సంవత్సరంపాటు తలనీలాలు పోగు చేసుకునేందుకు నిర్వహించిన వేలంలో అగులెరు పోలెటి రూ.2,65,000కు దక్కించుకున్నారు.

చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలి



మంతన్‌గౌడ్‌లో అంగన్‌వాడీ సిబ్బందితో చర్చిస్తున్న ప్రత్యేకాధికారి వెంకటేష్

బషీరాబాద్, ఫిబ్రవరి 22: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల పట్ల టీచర్లు, ఆయాలు ప్రత్యేక దృష్టి సారించాలని బషీరాబాద్ తహసీల్దార్, గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి వై.వెంకటేష్ సూచించారు. మండలంలోని మంతన్‌గౌడ్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఎలాంటి పౌష్టికాహారం అందిస్తున్నారని అంగన్‌వాడీ టీచర్‌ను ఆరా తీస్తూ అక్కడున్న సరుకులను పరిశీలించారు. అంతకుముందు పంచాయతీ కార్యదర్శితో కలిసి గ్రామంలో మురుగునీటి వ్యవస్థ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం, కార్యదర్శి బాలరంగాచారి ఉన్నారు.

పోలెపల్లి ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీ



ఆలయంలో నూతన కమిటీ ఎన్నికతో ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 22: దుద్యాల మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ దేవస్థానం నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా ఏదుల జయరాములు, సభ్యులుగా బ్యాగరి నర్సింహులు, కొండని మునికుమార్, కొత్తూర్ రాములు, కోడిగంటి వెంకటయ్య, కుమ్మరి యాదయ్య, ఏదుల నర్సింహులు, సున్నల లక్ష్మితో దేవస్థానం మేనేజర్ రాజేందర్ రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్, మెరుగు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బొంకూరు, బిజ్వార్‌లో ముగిసిన జాతర

● కనుల పండువగా మల్లిఖార్జునస్వామి కల్యాణం



బిజ్వార్ మల్లికార్జునస్వామి జాతరలో బోనాల ఊరేగింపు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 22: తాండూరు మండలం బొంకూరు, బిజ్వారం గ్రామంలో మూడు రోజులపాటు కొనసాగిన మల్లికార్జున స్వామి జాతర గురువారం సాయంత్రం ముగిసింది. గురువారం బోనాల ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలు, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 11 గంటలకు ఆలయ ధర్మకర్త కుర్వ కిష్టయ్య ఆధ్వర్యంలో భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి కల్యాణాన్ని రాస్నంకు చెందిన స్వాములు శివకుమార్, మల్లయ్యస్వాములు వేద మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. అనంతరం వధూవరులను ఆశీర్వదించారు. ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, మాజీ ఉపసర్పంచ్‌లు పోతుగంటి హన్మంతు, రమేష్, విజయ, కుర్వ బసంత్, శ్రీలత, బాల్‌రాజ్,మమత, చిలకమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.

పాటిమీదిపల్లిలో సీసీరోడ్డు పనులు ప్రారంభం



పాటిమీదిపల్లిలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 22: మండలంలోని పాటిమీదిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీసీరోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వార్ల సంతోష్‌కుమార్, గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్, యువ నాయకులు శాంత్‌కుమార్, శంకర్, నాగరాజు, వెంకట్, షైపాల్, వెంకట్రాములు, మాణిక్యప్ప తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

తాండూరురూరల్, ఫిబ్రవరి 22: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ అన్నారు. తాండూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్, ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు రూ.26వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోలెపల్లి ఎల్లమ్మ దేవతను దర్శించుకున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్



అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు, అర్చకులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 22: దుద్యాల మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ దేవతను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన స్పీకర్‌కు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. కులమతాలకతీతంగా అన్నీ వర్గాల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలెపల్లి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దర్గాలో బషీరాబాద్ ఎంపీపీ దంపతుల ప్రార్థనలు



దర్గాను సందర్శించి ప్రార్థనలు చేస్తున్న బషీరాబాద్ ఎంపీపీ దంపతులు

బషీరాబాద్, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని ఉర్సె షరీఫ్ హజ్రత్ శంషాఖాద్రీ దర్గాలో ఉర్సు ఉత్సవాలు మూడోరోజు వైభవంగా కొనసాగాయి. గురువారం బషీరాబాద్ ఎంపీపీ దంపతులు కరుణఅజయ్‌ప్రసాద్ దర్గాను సందర్శించి ప్రార్థనలు చేశారు. వీరి వెంట కాంగ్రెస్ నాయకులు శ్రావణ్‌కుమార్, ఆర్‌ఎంపీ వైద్యులు నర్సింహ, రియాజ్ తదితరులున్నారు

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ పురుషోత్తం

దోమ, ఫిబ్రవరి 22: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని మండల తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. గురువారం దోమ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ మంజుల, ఎంపీడీవో మహేశ్‌బాబు, ఎస్‌ఐ ఆనంద్‌కుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ ఫైనాన్స్ మెంబర్‌గా రమేష్ మహారాజ్ నియామకం హర్షదాయకం



రాష్ట్ర ఫైనాన్స్‌కమిటీ సభ్యుడు రమేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

యాలాల, ఫిబ్రవరి 22: తాండూరు ప్రాంతానికి చెందిన రమేష్ మహారాజ్‌ను తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ మెంబర్‌గా ప్రభుత్వం నియమించడం హర్షదాయకమని కోఆప్షన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా అన్నారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రమేష్ మహారాజ్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాపోల్ నాగయ్య, అశోక్, శ్రీనివాస్, మారుతి, శేఖర్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.



రమేష్ మహారాజ్‌ను సన్మానిస్తున్న యాలాల కాంగ్రెస్ నాయకులు

తాండూరు: తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడిగా నియామకమయ్యాక గురువారం మొదటిసారి తాండూరుకు వచ్చిన ఎం.రమేష్‌ను పలువురు అభినందించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, ఉత్తంచంద్, బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ ఆయన్ను సన్మానించారు.

బద్లాపూర్‌తండాలో నీటి సమస్యకు పరిష్కారం

బషీరాబాద్, ఫిబ్రవరి 22 : మండలంలోని బద్లాపూర్‌తండాలో తాగునీటి సమస్యకు గురువారం పరిష్కారం లభించింది. ఎంపీపీ కరుణ అజయ్‌ప్రసాద్ చొరవతో బోరును అధికారులు వినియోగంలోకి తీసుకువచ్చారు. తండాలో నాలుగు రోజులుగా మిషన్‌భగీరథ నీటి సరఫరా గేట్‌వాల్వ్ మరమ్మత్తుకు సమస్య తలెత్తడంతో ప్రజలు బోర్లను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ, ఎంపీడీవో రాఘవులుతో చర్చించి స్థానికంగా ఉన్న కొత్త బోరును అందుబాటులోకి తేవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.